సాక్షి
నల్లగొండ
మంగళవారం । 8 । ఆగస్టు । 2023



కొలువు కొట్టారు !
ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు యువతీ యువకులు ఎస్‌ఐ తుది ఫలితాల్లో కొలువు సాధించి సత్తాచాటారు. - 8లో



అడ్డొస్తున్నాడని..
సంసార జీవితానికి అడ్డు వస్తున్నాడని బాలుడిన్ని హత్య చేసింది ఓ మహిళ. ఈ ఘటన సూర్యాపేటలో జరిగింది. - 8లో



చేనేతలకు పురస్కారాలు
చేనేతరంగంలో విశేష ప్రతిభ కనబర్చిన పలువురు కళాకారులు రాష్ట్ర పురస్కారాలు అందుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నూలుపోగు వేసి జాతిపితకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: చేనేత దినోత్సం సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం నల్లగొండలో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి నూలుపోగును వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, కర్నాటి యాదగిరి, రావిరాల వెంకట్, సురేష్, మత్స్యగిరి, కీర్తిశ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

ఏఎంఆర్‌పీ స్పెషల్ కలెక్టర్‌గా హరిసింగ్

- స్పెషల్ కలెక్టర్ పీఏగా శ్రీదేవి



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న హరిసింగ్

నల్లగొండ: ఏఎంఆర్‌పీ ప్రత్యేక భూ సేకరణ విభాగం స్పెషల్ కలెక్టర్‌గా డి.హరిసింగ్ నియమితులయ్యారు. ఆయన వరంగల్‌లో అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై నల్లగొండకు వచ్చారు. సోమవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అనంతరం ఆయన విధుల్లో చేరారు. కాగా ఈ స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ పీఏగా వి.శ్రీదేవి బాధ్యతలు స్వీకరించారు. ఆమె సూర్యాపేట కలెక్టరేట్‌లో ఏఓగా పనిచేస్తూ ఇటీవల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఆమెకు స్పెసల్ కలెక్టర్ పీఏగా పోస్టింగ్ ఇవ్వడంతో ఆమె కూడా సోమవారం విధుల్లో చేరారు.

శాంతిభద్రతల సమస్య రాకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: భూ వివాదాలను శాంతిభద్రతల సమస్యగా మారకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అపూర్వరావు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం నల్లగొండలోని తన కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డేలో వివిధ ప్రాంతాలకు చెందిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. అత్యధికంగా భూ సమస్యలు, కుటుంబ తగాదాలు, ఫైనాన్స్ వేధింపులపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర దర్యాప్తు చేసి తగిన నివేదిక ఇవ్వాలని ఎస్‌ఐలకు సూచించారు.

ఆసరా పింఛన్ల స్వాహాపై విచారణ

కేతేపల్లి: మండలంలోని కొప్పోలు గ్రామంలో ఆసరా పింఛన్లు, పోస్టాఫీసులో దాచుకున్న రికరింగ్ డిపాజిట్ సొమ్మును బ్రాంచి పోస్టుమాస్టర్ స్వాహా చేసిన ఘటనపై సోమవారం అధికారులు విచారణ జరిపారు. 'రూ.కోటి గోవింద' అనే శీర్షికన బీపీఎం చేసిన అవినీతిపై ఇటీవల సాక్షి పత్రికలో వచ్చిన వార్తతో అధికారులు స్పందించారు. సోమవారం గ్రామానికి చేరుకున్న పోస్టల్ అధికారులు ఘటనపై స్థానిక పోస్టాఫీసు కార్యాలయంలో విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా పోస్టాఫీసులో బీపీఎం దాచి ఉంచిన ఉన్న ఆర్డీ పాసు బుక్కులను అధికారులు బాధితులకు అందజేశారు. అనంతరం బాధితులను విడివిడిగా విచారణ జరిపి వారి నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. గ్రామంలో నెలకు సంబంధించి 126 మంది పింఛన్‌దారులకు దాదాపు రూ.3లక్షల చెల్లించాల్సి ఉన్నట్లుగా తమ విచారణలో తేలిందని అధికారులకు తెలిపారు. ఆర్డీలకు సంబంధించి మరో రెండు రోజుల పాటు విచారణ జరిపిన అనంతరం పూర్తి వివరాలు తెలియచేస్తామని చెప్పారు. విచారణలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, సుధీర్, అంజి ఉన్నారు.



విచారణ జరుపుతున్న పోస్టల్ అధికారులు

ఎమ్మెల్యేలకు ఊరట!

అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధులు వచ్చాయ్..

- స్థానికంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు వెసులుబాటు
- మిగిలిపోయిన హామీల అమలుకు అవకాశం
- ఒక్కో నియోజకవర్గానికి రూ.2.25 కోట్ల చొప్పున విడుదల
- ఇదివరకే రూ.75 లక్షల చొప్పున విడుదల చేసిన ప్రభుత్వం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'మా గ్రామంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. బాగు చేస్తానని హామీ ఇచ్చారు. కానీ, పట్టించుకోవడం లేదు..' అంటూ వచ్చే విమర్శలకు బ్రేక్ వేసే అవకాశం ఎమ్మెల్యేలకు వచ్చింది. నియోజకవర్గ అభివృద్ధి పథకం (సీడీపీ) నిధులు వచ్చేశాయి. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో మిగిలిపోయిన హామీలను అమలు చేసే వెసలుబాటు కలిగింది. ఒక్కో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి ఇదివరకే రూ.75 లక్షల చొప్పున విడుదల చేసిన ప్రభుత్వం ఇప్పుడు రూ.2.25 కోట్ల చొప్పున ఇచ్చేసింది. సాధారణంగా ఏడాదిలో మూడు నెలల కోసారి నాలుగు విడతల్లో ఈ నిధులను విడుదల చేసే ప్రభుత్వం ఈసారి రెండో విడతలోనే పూర్తిగా ఇచ్చేసింది. అసలే సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ సమయంలో ప్రజల ఆశీర్వాదం ఎంతో ముఖ్యం. ఇప్పటికే నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టినా, ఎన్నికల సమయంలో ఇచ్చిన కొన్ని హామీలు, మిగిలిపోయిన అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. పెద్ద పనులకు ప్రభుత్వమే నిధులను కేటాయించి చేపడుతోంది. స్థానికంగా గ్రామాల్లో, పట్టణాల్లోని వార్డుల్లో చిన్న చిన్న పనులు చేయాలంటే నిధులు లేని పరిస్థితి నెలకొంది. మున్సిపాలిటీల్లో వచ్చే ఆదాయం, గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే నిధులు వేతనాలు, నిర్వహణకే సరిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో అభివృద్ధికి సరిపడ నిధుల్లేక సతమతం అవుతున్న ఎమ్మెల్యేలకు ఇప్పుడు సీడీపీ నిధులు రావడం ఎంతో ఊరట ఇస్తుంది. ఈ నిధులతో నియోజకవర్గాల్లో 98 రకాల అభివృద్ధి పనులను చేపట్టే అవకాశం వచ్చింది.

రూ.20.25 కోట్లు విడుదల

జిల్లాకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత కింద ప్రభుత్వం రూ.20.25 కోట్లు విడుదల చేసింది. ఆరుగురు ఎమ్మెల్యేలకు, ముగ్గురు ఎమ్మెల్సీలకు ఈ మొత్తాన్ని ఇచ్చింది. జిల్లా మంత్రి ఆమోదంతో నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యేలు ప్రతిపాదనలను ఇస్తే ఆ పనులను ఈ నిధులతోనే చేపట్టనున్నారు. నల్లగొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ, మునుగోడు, నకిరేకల్ ఎమ్మెల్యేలతోపాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎంసీ కోటిరెడ్డిలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఈ నిధులను ప్రభుత్వం కేటాయించింది.

రూ.5 కోట్లలో రూ.2 కోట్లు స్కూళ్లకే..

నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గతంలో ఒక్కో ఎమ్మెల్యేకు రూ.3 కోట్లు మాత్రమే ప్రభుత్వం కేటాయించేది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ మొత్తాన్ని రూ.5 కోట్లకు పెంచింది. అయితే కరోనా సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఆగిపోయాయి. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో ఇచ్చింది. ఈసారి కూడా ముందుగానే 2023-2024 సంవత్సరానికి సంబంధించిన నిధులను విడుదల చేసింది. మొదటి విడతగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒక్కొక్కరికి రూ.75 లక్షల చొప్పున రూ. 6.76 కోట్లు ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు రెండో విడత కింద ఒక్కొక్కరికి రూ. 2.25 కోట్ల చొప్పున విడుదల చేసింది. ఒక్కో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇవ్వాల్సిన మిగతా రూ 2 కోట్ల చొప్పున నిధులను పాఠశాలల అభివృద్ధికి కేటాయించింది. 'మన ఊరు మన బడి' కింద ఈ నిధులతో అభివృద్ధి పనులను చేపడుతోంది. రాష్ట్ర స్థాయిలోనే ఎమ్మెల్యేల కోటా నుంచి వీటిని కట్ చేసి నేరుగా సంబంధిత పాఠశాలల యాజమాన్య కమిటీల ఖాతాల్లో జమ చేస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఏయే పాఠశాలలను ఎంపిక చేస్తారో వాటిని ప్రభుత్వం ఆ నిధులతోఅభివృద్ధి చేస్తోంది.

రెగ్యులరైజ్ చేయాలని ఆందోళన



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

నల్లగొండ టౌన్: పదహారు సంవత్సరాలుగా పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ సోమవారం రెండోవ ఏఎన్‌ఎంలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ కర్ణన్‌కు సామూహికంగా వినతిపత్రాలు అందజేశారు. రెండో ఏఎన్‌ఎంలు పెద్ద ఎత్తున కలెక్టరేట్‌కు తరలిరావడంతో రద్దీ ఏర్పడింది. వీరి ఆందోళనకు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. కరోనా సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించిన రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.అరుణ, సరళ, నాగమణి, వసంత, వి.ఉమారాణి, వై.శోభ, రాణి, లలిత, పార్వతి, రత్నకుమారి, జి.పుష్ప, చంద్రకళ, అండమ్మ, గీత, అండాలు, మంజుల, సరిత, సాలమ్మ, వి.కృపారాణి తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా లక్ష్యాలను పూర్తిచేయాలి

- కలెక్టర్ కర్ణన్

నల్లగొండ: ప్రభుత్వ పథకాల లక్ష్యాలను నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి వివిధ అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. హరితహారం లక్ష్యాన్ని సెప్టెంబర్ 15లోగా పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో గొర్రెల యూనిట్ల గ్రౌండింగ్ వేగంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గానికి 300 చొప్పున ఎంపిక చేసిన బీసీ కుల వృత్తిదారులకు రూ.లక్ష సాయం చెక్కులను వెంటనే పంపిణీ చేయాలన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ కింద జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం ప్రకారం లబ్ధిదారుల ఎంపిక చేయాలన్నారు. సోషల్ వెల్ఫేర్ పరిధిలో ఇళ్లపట్టాల పంపిణీ, కారుణ్య నియామకాల ప్రక్రియను 10 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అలాగే వివిధ అంశాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఎఫ్‌ఓ రాంబాబు, డీఆర్‌డీఓ కాళిందిని, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి, డీఏఓ సుచరిత, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంగీతలక్ష్మి జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి విజయేందర్‌రెడ్డి, బీసీ అభివృద్ధి అధికారి ఖాజానజీం అప్సర్ అలీ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి యాదగిరి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

ఎడమ కాల్వకట్టపై రంధ్రాన్ని త్వరలోనే పూడుస్తాం

- ఎన్‌ఎస్‌పీ ఈఈ లక్ష్మణ్‌నాయక్

సాక్షి ఎఫెక్ట్..

త్రిపురారం: కంపాసాగర్ పరిధిలో సాగర్ ఎడమ కాల్వ కట్టపైన తూం వద్ద పడిన రంధ్రాన్ని త్వరలోనే పూడుస్తామని ఎన్‌ఎస్‌పీ ఈఈ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. పెద్దదేవులపల్లి రిజర్వాయర్ సమీపంలో కంపాసాగర్ తూం వద్ద కాల్వకట్టపై ఏర్పడిన భారీ రంధ్రంపై సోమవారం సాక్షి పత్రికలో ప్రచురితమైన వార్తకు ఎన్‌ఎస్‌పీ అధికారులు స్పందించి కట్ట పరిస్థితిని పరిశీలిచారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా కాల్వకట్ట కుంగి రంధ్రం ఏర్పడిందని, పని విలువను అంచనా వేసి ఎమర్జెన్సీ టెండర్ ద్వారా పూడుస్తామన్నారు. ఆయన వెంట ఎన్‌ఎస్‌పీ డీఈ గోపినాథ్, సిబ్బంది ఉన్నారు.



రంధ్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జిల్లా పరిషత్‌ను ముట్టడించిన స్వీపర్లు



జెడ్పీ కార్యాలయం గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు

నల్లగొండ టౌన్: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు 43 రోజులుగా చేస్తున్న ఆందోళనలో భాగంగా సోమవారం నల్లగొండలోని జిల్లా పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం గేటును మూసి వేసి ఉద్యోగులకు కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. కార్యాలయంలోకి వెళ్లేదుకు వచ్చిన జెడ్పీ డిప్యూటీ సీఈఓ కాంతమ్మకు వినతిపత్ర అదజేసి కాళ్లమొక్కి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, పనస నర్సింహ, పి.ఎల్లయ్య, సత్తార్, పూలమ్మ, నారాయణ, యాదగిరి, లింగయ్య, నాగయ్య, స్వామి, కోటయ్య, కృష్ణవేణి, సోమలింగమ్మ, దేవి తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఈఓ కాళ్లు మొక్కుతున్న మహిళా స్వీపర్

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

- భారీగా తరలివచ్చిన అర్జీదారులు
- ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ కర్ణన్ సూచన

రామగిరి(నల్లగొండ): కలెక్టరేట్‌లో సోమవారం కొనసాగిన ప్రజావాణికి ప్రజల నుంచి ఫిర్యాదు వెల్లువెత్తాయి. కొత్త కలెక్టర్‌గా ఆర్‌వీ.కర్ణన్ బాధ్యతలు చేపట్టారు. దీంతో కొత్త కలెక్టర్‌కు తమ సమస్యలు విన్నవించేందుకు ప్రజలు వందల సంఖ్యలో తరలివచ్చి బారులుదీరారు. ఈ సందర్భంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించాల్సింగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్సీ కార్పొరేషన్, గిరిజన సంక్షేమ శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, సర్వే ల్యాండ్ రికార్డ్స్, డీఆర్‌డీఏ పరిధిలో వివిధ సమస్యలపై అధికంగా ఫిర్యాదులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

పోలీసుల తనిఖీలు..

ప్రజావాణికి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడంతో సోమవారం కలెక్టరేట్‌లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రతిఒక్కరినీ మెటల్ డిటెక్టర్‌తో తనిఖీ చేయడంతోపాటు మహిళలకు ప్రత్యేక తనిఖీ కేంద్రం కూడా ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ వచ్చే బాధితులు పురుగుల మందు, పెట్రోల్ పోసుకొని బెదిరించకుండా ముందస్తుగా పోలీసులు ముందస్తుగా సెక్యూరిటీని పెంచారు.



మెటల్ డిటెక్టర్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

క్రీడా మైదానం వేరోచోట ఏర్పాటు చేయాలి



మా గ్రామంలో దళితుల కమ్యూనిటీ హాల్ కోసం ప్రభుత్వం స్థలం కేటాయించారు. దానిలో క్రీడా మైదానం నిర్మించాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దళితులకు కేటాయించిన భూమిలో కాకుండా వేరే చోట క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి.
– సీహెచ్.కృష్ణయ్య, బోయినపల్లి, కనగల్ మండలం

అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి



ఇనుపాముల గ్రామ రెవెన్యూ శివారులో సర్వే నంబర్ 559లో ప్రభుత్వం మాకు రెండు ఎకరాల భూమి ఇచ్చింది. దాన్ని వేరే వ్యక్తికి కౌలుకు ఇచ్చాము. కౌలు డబ్బులు ఇస్తానని చెప్పి సదరు వ్యక్తి నిరక్షరాస్యులమైన మాతో తెల్ల కాగితంపై సంతకం చేయించుకుని అక్రమంగా పట్టా చేయించుకున్నాడు. మా భూమిని మాకు అప్పగించాలి.
– మేకల భిక్షమయ్య, భారతమ్మ, ఇనుపాముల, కేతేపల్లి మండలం

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



సర్వే 48లో ఉన్న ప్రభుత్వ భూమిలో 200 మంది ఇళ్లు కట్టుకొని నివాసముంటున్నారు. పట్టాల క్రమబద్ధీకరణ కోసం 2014లో జీఓ 59 ప్రకారం డీడీలు చెల్లించాం. గతంలో డీడీలు కట్టిన వారికి పట్టాలు ఇవ్వకుండా మళ్లీ డీడీలు కట్టమని అధికారులు అంటున్నారు. గతంలో డీడీలు కట్టిన వారికి ఇళ్ల పట్టాలు ఇప్పించి న్యాయం చేయాలి.
–ఎండీ. మజహర్, హాలియా

18 వేల మందికి 'గృహలక్ష్మి'

- ఒక్కో నియోజకవర్గానికి 3వేల ఇళ్లు మంజూరు
- నేటి నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- అర్హుల ఎంపిక జాబితాపై తుది నిర్ణయం ఎమ్మెల్యేలదే..



నల్లగొండ: తెలంగాణ ప్రభుత్వం పేదలకు గృహలక్ష్మి పథకం కింద జిల్లాకు ఇళ్లు మంజూరు చేసింది. ఒక్కో నియోజకవర్గానికి 3వేల చొప్పున జిల్లాలోని ఆరు నియోజకర్గాల పరిధిలో 18వేల ఇళ్లు మంజూరయ్యాయి. వాటికి సంబంధించి మంగళవారం నుంచి తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించనున్నారు.

ఒక్కో లబ్ధిదారునికి రూ.3లక్షలు..

ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కింద ఒక్కో లబ్ధిదారునికి రూ.3లక్షల చొప్పున మంజూరు చేయనుంది. ఈ డబ్బులతో లబ్ధిదారులు ఇళ్లను ఏవిధంగా అయినా నిర్మించుకునే వెసులుబాటు ఉంది. అయితే మంగళవారం నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. అనంతరం 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అధికారులు వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తారు. దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి నిజంగా దరఖాస్తుదారునికి ఇల్లు ఉందా లేదా. అతను ఏ పని చేస్తారు. అతడు అర్హుడా కాదా అనే వివరాలను సేకరించి 20వ తేదీలోగా వెల్లడిస్తారు.

అర్హతలు ఇవే..

దరఖాస్తుదారుడు స్థానికంగా ఉండాలి. ఖాళీ స్థలం భార్య పేరుపై ఉండాలి. ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు కలిగి ఉండాలి. దివ్యాంగులు అయితే సదరం సర్టిఫికెట్ కలిగి ఉండాలి. వీటితో దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి తహసీల్దార్, మున్సిపల్ కార్యాయంలో దరఖాస్తులను స్వీకరించేందుకు కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు.

ఎమ్మెల్యేలదే తుది నిర్ణయం..

ఆయా నియోజకవర్గాల్లో అధికారుల పరిశీలన అనంతరం అర్హులకు గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు మంజూరు చేయనున్నారు. అందుకు సంబంధించి అధికారులతో దరఖాస్తులన్నింటినీ పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం ప్రజా ప్రతినిధులకే అప్పగించింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో అర్హుల ఎంపిక జాబితాపై ఎమ్మెల్యేలదే తుది నిర్ణయం ఉండనుంది.

25 నుంచి ఇళ్ల మంజూరు ఉత్తర్వులు..

అర్జీలను పరిశీలించి అర్హుల జాబితాను తేల్చుతారు. జిల్లాలో 18వేల మంది అర్హుల జాబితా సిద్ధమైన తర్వాత 25నుంచి గృహలక్ష్మి పథకం కింద మంజూరైన ఉత్తర్వులను అందించే అవకాశం ఉంది. ఎమ్మెల్యేలు, అధికారుల చేతుల మీదుగా ఈ మంజూరు ఉత్తర్వులు అందించనున్నట్టు సమాచారం.

గద్దర్ మరణం.. తెలంగాణకు తీరని లోటు



నల్లగొండ గడియారం సెంటర్‌లో కొవ్వొత్తులతో గద్దర్‌కు నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నేతలు

నల్లగొండ: తన గళంతో ఉద్యమాలను ఉర్రూతలూగించి కోట్లాది మంది ప్రజల అభిమానాన్ని చూరగొన్న ప్రజా ఉద్యమ గొంతుక ప్రజాయుద్ధ నౌక గద్దర్ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు అన్నారు. గద్దర్ అకాల మరణం పట్ల నల్లగొండ జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద సోమవారం ఆయన చిత్రపటం ముందు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై, ప్రజా ఆకాంక్షల కోసం రాజ్యంతో యుద్ధం చేసిన ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రయాణాన్ని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఖుర్షీద్ మీయా, పి.వెంకులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రత్నయ్య, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కాశయ్య, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు మానుపాటి భిక్షమయ్య, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జ చిన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ ఇరిగి శ్రీశైలం, టీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కొండేటి మురళి, కత్తుల చందన్, సోహెల్, పలస యాదగిరి, టి.వెంకటేశ్వర్లు, ఈద అంజయ్య, ఇమ్మడి జగతి, కె.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పట్టుబట్టారు.. కొలువు కొట్టారు

- పోలీసు శాఖలో ఎస్‌ఐలుగా ఉద్యోగాలు సాధించిన ఉమ్మడి జిల్లా యువత

అందరివీ సాధారణ మధ్య తరగతి కుటుంబాలే.. చదువుకుంటున్న దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.. అందుకు తగిన కృషి చేశారు. వివిధ వృత్తులు.. ఉన్నత చదువులు చదువుతున్నా లక్ష్యాన్ని మరువలేదు. పట్టుబట్టి సాధన చేశారు. ఒక్కో దశ దాటుకుంటూ గమ్యాన్ని చేరుకున్నారు. ఆదివారం విడుదలైన ఎస్‌ఐ ఉద్యోగ ఫలితాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా యువత సత్తా చాటారు. వివిధ కేటగిరీల్లో ఉద్యోగాలు సాధించి విజేతలుగా నిలిచారు.

గిరిజన ఆణిముత్యం ఎస్‌ఐగా..


వంశీ

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని పడమటి తండాకు చెందిన ఇస్లావత్ దస్రూ–తారీ దంపతులకు చెందిన గిరిజన ఆణిముత్యం ఇస్లావత్ వంశీ ఎస్‌ఐ ఉద్యోగం సాధించాడు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తూ ఉంటారు.వ్యవసాయ కుటుంబం, మారుమూల తండాలో జన్మించి ఉద్యోగం సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుడి కుమారుడు ఎస్‌ఐగా..


పత్తిపాటి శ్రీనివాస్

మేళ్లచెరువు : మేళ్లచెరువు గ్రామానికి చెందిన పత్తిపాటి కాశయ్య, యలమందమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాస్ బీటెక్ పూర్తి చేశాడు. చిన్ననాటి నుంచి ఎస్‌ఐ కావాలని కోరిక బలంగా పెంచుకున్న శ్రీనివాస్ ఇటీవల జరిగిన ఎస్‌ఐ ఎంపిక పరీక్షలో విజయం సాధించాడు. కష్టపడి చదివి ఎస్‌ఐ ఉద్యోగం పొందిన శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

తాపీమేస్త్రీ కుమారుడు ఎస్‌ఐగా..


రెడపంగు అశోక్

మఠంపల్లి: మండలంలోని పెదవీడుకు చెందిన నిరుపేద తాపీమేస్త్రీ రెడపంగు చినలక్ష్మయ్య, మంగమ్మల కుమారుడు రెడపంగు అశోక్ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. దీంతో గ్రామస్తులు అశోక్‌ను అభినందించారు. తమ కుమారుడు కష్టపడి చదివి ఉద్యోగం సాధిండం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

ఇద్దరికి ఎస్‌ఐ ఉద్యోగాలు


టి. మధుబాబు


గోగుల శిరీష

శాలిగౌరారం : రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన ఎస్‌ఐ ఉద్యోగ నియామక ఫలితాలలో శాలిగౌరారం మండలంలో ఇద్దరికి ఎస్‌ఐ ఉద్యోగాలు వరించాయి. వారిలో ఇటుకులపాడు గ్రామానికిచెందిన తాటిపాముల మధుబాబు, ఊట్కూరు గ్రామానికి చెందిన గోగుల శిరిష ఉన్నా రు. వీరాంత సివిల్ విభాగంలో ఎస్‌ఐ ఉద్యోగాలు సాధించారు. ఎస్‌ఐ ఉద్యోగాలు సాధించిన వారిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో..


భూపాల్‌రెడ్డి

కట్టంగూర్ : కట్టంగూర్ మండలంలోని కల్మెర గ్రామానికి చెందిన పిన్నపురెడ్డి భూపాల్ రెడ్డి ఆర్మీలో పనిచేస్తూ రెండు సంవత్సరాల క్రితం రిటైర్మెంట్ తీసుకున్నాడు. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో పరీక్ష రాసి సివిల్ ఎస్‌ఐ ఉద్యోగం సంపాదించాడు. తల్లిదండ్రులు రామకృష్ణారెడ్డి విమలమ్మలది రైతు కుటుంబం.

రైతు కుమారుడు ఎస్‌ఐగా..


చింతల నితిన్‌రెడ్డి

కట్టంగూర్ : కట్టంగూర్ గ్రామ పంచాయతీ పరిధి మీరసాహెబ్‌గూడేనికి చెందిన చింతల సైదిరెడ్డిశోభారాణిల ఏకైక కుమారుడు నితిన్‌రెడ్డి. తల్లి అంగన్‌వాడీ టీచర్ కాగా తండ్రి రైతు. బీటెక్ పూర్తి చేసిన వెంటనే ఎస్‌ఐ నోటిఫికేషన్ రావటంతో దరఖాస్తు చేసుకుని సన్నద్ధమై సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు.

దర్జీ కూతురు సివిల్ ఎస్‌ఐగా..


గట్టు శ్రుతి

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన గట్టు ఉపేందర్, హేమలత దర్జీ పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. అమ్మాయిలను దర్జీ పని చేస్తూ కష్ట పడి చదివించారు. వీరి కుమార్తె శ్రుతి బీటెక్ పూర్తి చేసింది. నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేసుకుని సన్నద్ధమై సివిల్ ఎస్‌ఐగా ఎంపికైంది.

సోదరుల స్ఫూర్తితోనే..


కందుల వెంకటేష్

మునగాల : మునగాల మండలం తాడువాయి గ్రామానికి చెందిన కందుల వెంకన్న – వెంకట్రావమ్మ దంపతులది మధ్య తరగతి కుటుంబం. కొద్దిపాటి భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి నర్సింహారావు, రామారావు, వెంకటేష్ కుమారులు. వీరు బీటెక్ పూర్తిచేశారు. మూడో కుమారుడు కందుల వెంకటేష్ బీటెక్ పూర్తిచేసి తొలి ప్రయత్నంలోనే ఏఆర్ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. ఇతని సోదరులు కానిస్టేబుళ్లసోదరులను స్ఫూర్తిగా తీసుకుని ఎస్‌ఐ కొలువు సాధించానని వెంకటేష్ పేర్కొన్నాడు.

కానిస్టేబుల్ నుంచి ఎస్‌ఐగా...


తూటుపల్లి అజయ్

గుర్రంపోడు: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం పిట్ట లగూడెం గ్రామానికి చెందిన తూటుపల్లి సత్తమ్మ, మల్ల య్య దంపతుల కుమారుడు తూటుపల్లి అజయ్ 2016లో పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్ పనిచేస్తూ రెండో ప్రయత్నంలో సివిల్ ఎస్‌ఐ ఉద్యోగం సాధించాడు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. అజయ్ పాలిటెక్నిక్ డిప్లమా చేశాడు. ఎస్‌ఐగా ఎంపికైన అజయ్‌ను పలువురు అభినందించారు.

కష్టానికి ఫలితం


సురేష్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జున సాగర్): తిరుమలగిరి మండలం బోయగూడెం గ్రామానికి చెందిన వర్కాల వెంకట్‌రెడ్డి, రేవ తి దంపతులకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు నరేష్‌రెడ్డి హాలియాలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. రెండో కుమారుడు సురేష్‌రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. 2018 సంవత్సరంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తూనే సివిల్ ఎస్‌ఐ ఉద్యోగం సాధించాడు. సురేష్‌రెడ్డి ఎస్‌ఐగా ఎంపిక కావడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.

రెండో ప్రయత్నంలో ఎస్‌ఐగా..


వీరమల్ల అఖిల్

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన వీరమల్ల చంద్రశేఖర్, కృష్ణవేణిలకు కూతురు మౌనిక, కుమారుడు అఖిల్ ఉన్నారు. చంద్రశేఖర్ గరిడేపల్లిలో మండలం పెంచికల్‌దిన్నె పీహెచ్‌సీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. తల్లి గృహిణి. అఖిల్ గతంలో ఎస్‌ఐ పరీక్ష రాసి ఒక మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయాడు. కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం భువనగిరి జిల్లాలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. కోచింగ్ తీసుకోకుండా స్వతహాగా కష్టపడి చదివి ఏఆర్ ఎస్‌ఐ కొలువు సాధించాడు.

సివిల్ ఎస్‌ఐగా ప్రియాంక


ప్రియాంక

చిలుకూరు: చిలుకూరు మండలం పరిధిలోని జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన పందిరి అమృతరెడ్డి లక్ష్మి దంపతులది వ్యవసాయ కుటుంబం. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. వీరి రెండో కుమార్తె ప్రియాంక ఎంటెక్ పూర్తి చేసింది. ఈమె సోదరి తేజస్విని జైలు వార్డెన్‌గా పనిచేస్తుండగా తమ్ముడు శ్రీకాంత్‌రెడ్డి సివిల్ ఇంజనీర్ పూర్తి చేశాడు. ప్రియాంక పదో తరగతి వరకు జెర్రిపోతులగూడెంలో, ఇంటర్, ఇంజనీరింగ్ కోదాడలో, ఎంటెక్ హైదరాబాద్‌లో పూర్తి చేసింది. తొలి ప్రయత్నంలోనే ఎస్‌ఐగా ఉద్యోగం సాధించడం ఎంతో సంతోషంగా ఉందంటోంది.. ప్రియాంక. ఆమెను ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబుతో పాటు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

పెదనాన్న కోరిక మేరకు..


సుబ్బరాంరెడ్డి

హుజూర్‌నగర్ : గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన పశ్య నిర్మల సత్యనారాయణ రెడ్డిల కుటుంబం కొన్నేళ్లుగా హుజూర్‌నగర్‌కు వచ్చి ఉంటోంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో చిన్న కుమారుడు మెఘనాథ్‌రెడ్డి ప్రస్తుతం ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. పెద్ద కుమారుడు సుబ్బరాంరెడి బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి పెద న్నాన పుల్లారెడ్డి కోరిక మేరకు ప్రభుత్వ ఉద్యోగాల వేటలో పడ్డాడు. చివరికి (ఫైర్) ఎస్‌ఐ ఉద్యోగం సాధించాడు. ఇంకా ఉన్నత ఉద్యోగం సాధిస్తానంటున్నాడు.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో..


కుసుమ ఉపేందర్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామానికి చెందిన కుసుమ పద్మ–శ్రీనివాస్‌రెడ్డిలది మధ్యతరగతి కుటుంబం. ఈ దంపతులకు ఇద్దరు సంతానంలో వీరిలో అమ్మాయి ఉమ పెద్దదిగా కాగా చిన్నవాడు ఉపేందర్‌రెడ్డి. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంసీఏ పూర్తి చేశాడు. 2023లో రైల్వే గ్రూప్–డి ట్రాక్ కీపర్(గ్యాంగ్‌మన్) ఉద్యోగం చేస్తూనే సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించానని చెబుతున్నాడు.. ఉపేందర్‌రెడ్డి.

తొలి ప్రయత్నంలోనే..


సందీప్‌రెడ్డి

నడిగూడెం : నడిగూడేనికి చెందిన బోళ్ల సీతారాంరెడ్డి, విజయలక్ష్మి దంపతులది రైతు కుటుంబం. వీరి కుమారుడు సందీప్ రెడ్డి బాసరలో ట్రిపుల్‌ఐటీ పూర్తి చేశాడు. కోచ్ పల్లపు నాగేశ్వరరావు వద్ద శిక్షణ తీసుకొని తొలి ప్రయత్నంలోనే ఎస్‌ఐ కొలువు సాధించాడు.

అంటెండర్ కూతురు ఎస్‌ఐగా..


శాతం మౌనిక

ఆలేరురూరల్ : ఆలేరు మున్సిపాలిటీ 3వ వార్డు ఆదర్శనగర్‌కు చెందిన స్వామి, ఆండాలు దంపతులకు మౌనిక సంతానం. స్వామి ఆలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కాంట్రాక్ట్ అంటెండర్‌గా పని చేస్తున్నాడు. తల్లి టైలరింగ్ చేస్తోంది. ఎమ్మెస్సీ పూర్తి చేసిన మౌనిక ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తూనే సన్నద్ధమై తొలి ప్రయత్నంలోనే సివిల్ ఎస్‌ఐ కొలువు సాధించింది. పీఈటీ పూసలోజు కృష్ణచారి కొచింగ్‌తోనే ఈవెంట్స్‌లో రాణించానని, తండ్రి ఆశయాన్ని సాధించినందుకు సంతోషంగా ఉందంటోంది.. మౌనిక. ఆమెను పలువురు అభినందించారు.

ఎస్‌ఐగా ఎంపికైన సతీష్


కన్నెబోయిన సతీష్

వేములపల్లి మండలం మొలకపట్నం గ్రామానికి చెందిన కన్నెబోయిన రమేష్ నాగమ్మ దంపతులది నిరుపేద కుటుంబం. వీరి కుమారుడు కన్నెబోయిన సతీష్ డిగ్రీ పూర్తి చేశాడు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుకున్న సతీష్ ఎస్‌ఐ కొలువు సాధించడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. సతీష్‌ను గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు.

కూలీ బిడ్డ ఎస్‌ఐగా ..


గణేష్

డిండి : డిండి మండల పరిధిలోని దాక్యాతండాకు చెందిన వడత్య హరిచంద్, నాజుల దంపతులకు 5గురు సంతానం. కూలీ పని చేస్తూ తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరి రెండవ కుమారుడైన గణేష్ తొలి ప్రయత్నంలోనే ఎస్‌ఐ ఉద్యోగం సాధించాడు. కూలీ బిడ్డగా పుట్టి కొలువు సాధించిన గణేష్‌ను తండావాసులు అభినందించారు.

ఒకే ఇంట్లో ముగ్గురికి ఉద్యోగాలు..


రాజశేఖర్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, గోవిందరెడ్డి

హుజూర్‌నగర్ : చింతలపాలేనికి చెందిన ఆదిలక్ష్మి, శ్రీనివాసరెడ్డిలది వ్యవసాయ కుటుంబం. వారికి ముగ్గురు కుమారులు . పెద్ద కుమారుడు రాజశేఖర్‌రెడ్డి 2016లో కానిస్టేబుల్‌గా, రెండవ కుమారుడు గోవిందరెడ్డి 2018లో ఆర్ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. మూడవ కుమారుడు విజయ భాస్కర్‌రెడ్డి ఎస్‌ఐ ఉద్యోగం సాధించాడు.

సుతారి మేస్త్రీ కుమార్తె ఎస్‌ఐగా..


తేజస్విని

వేములపల్లి : వేములపల్లి మండలం సల్కునూరు గ్రామానికి చెందిన అంకెపాక బాబు సుతారి మేస్త్రీ కాగా తల్లి రాణి వీఓఏగా పని చేస్తుంది. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎంఎస్సీ మాథమెటిక్స్ చదువుతూనే సన్నద్ధమై ఎస్‌ఐ కొలువు సాధించింది. తేజస్వినిని తల్లిదండ్రులు, గ్రామస్తులు, బంధుమిత్రులు అభినందించారు.

డిప్యూటీ జైలర్‌గా..


పండ్ల నాగరాజు

గరిడేపల్లి మండలం పానుగోడు గ్రామం గీత కార్మిక కుటుంబానికి చెందిన పండ్ల నాగరాజు డిప్యూటీ జైలర్‌గా ఎంపికయ్యాడు. నాగరాజు అన్న హైదరాబాద్‌లోని మహేశ్వరంలో ఫైర్ ఎస్‌ఐగా పని చేస్తున్నాడు. నాగరాజు తల్లి గ్రామంలో కారం మిల్లు నడుపుతోంది. డిప్యూటీ జైలర్‌గా ఎంపికైన నాగరాజును పలువురు అభినందించారు.

పంచాయతీ కార్యదర్శి ఎస్‌ఐగా..


అజయ్ భార్గవ్

గరిడేపల్లి : మండలంలోని పానుగోడు గ్రామానికి చెందిన బాల్తు గురువయ్య–స్వరూపల కుమారుడు బాల్తూ అజయ్ భార్గవ్ మునగాల మండలం జగన్నాధపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నాడు. ఓ వైపు విధులు నిర్వహిస్తూనే మరో వైపు స్వతహాగా సన్నద్ధమై సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు.

'కొలువు'దీరిన పేదింటి బిడ్డ


మల్లికంటి శ్రీకాంత్

గరిడేపల్లి మండలం పానుగోడు గ్రామానికి చెందిన మల్లికంటి వెంకట్రాములు(లేట్)–పద్మలది నిరుపేద కుటుంబం. వీరి కుమారుడు మల్లికంటి శ్రీకాంత్ ఉన్నత విద్య అభ్యసించి ఎస్‌ఐ కొలువుకు సన్నద్ధమై తొలి ప్రయత్నంలోనే విషయం సాధించాడు. సివిల్ ఎస్‌ఐ ఉద్యోగం సాధించిన శ్రీకాంత్‌ను పలువురు అభినందించారు.

తొలి ప్రయత్నంలోనే..


మల్లికంటి మౌనిక

గరిడేపల్లి మండలం పానుగోడు గ్రామానికి చెందిన మల్లికంటి శ్రీనివాస్–యశోధ దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి ముగ్గురు ఆడపిల్లలు సంతానం. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరి రెండో కుమార్తె మౌనిక ఎంఫార్మసీ చేస్తూ పోలీసు కొలువుకు సన్నద్ధమైంది. తొలి ప్రయత్నంలోనే సివిల్ ఎస్‌ఐగా ఎంపికైంది.

కానిస్టేబుల్‌గా చేస్తూనే..


సాగర్ల అనిత

చిట్యాల : మున్సిపాలిటీలోని వెంకటాపురాని చెందిన సాగర్ల అనిత 2013లో ఎంబీఏ పూర్తి చేసింది. 2018లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తోంది. లక్ష్యంతో చదివి ప్రస్తుతం సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యింది. ఆమెకు భర్త చిర్రబోయిన వెంకన్నతో పాటు ఇద్దరు పిల్లలున్నారు.

స్వతహాగా సన్నద్ధమై...


కంచుగట్ల లైల

అర్వపల్లి : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన కంచుగట్ల లింగయ్య–అంజమ్మల కుమార్తె లైల వివాహం కుంచమర్తి సర్పంచ్ ఉగ్గంపేం ద్రలింగరాజు కుమారుడు కిశోర్‌తో 2020 డిసెంబర్‌లో జరిగింది. లైల ఎమ్మెస్సీ వరకు చదువుకుంది. ఇంటి వద్దే చదువుకొని రెండో ప్రయత్నంలో ఎస్సైగా ఎంపికైంది. కాగా ఆమె సోదరుడు కంచుగట్ల నరేష్ కూడా ప్రస్తుతం హైదరాబాద్‌లో టీఎస్ఎస్‌పీ ఎస్సైగా పనిచేస్తున్నారు.


తల్లిదండ్రులు లింగయ్య–అంజమ్మలకు మిఠాయి తినిపిస్తున్న కూతురు లైల

బీటెక్ విద్యార్థి ఎస్‌ఐగా ఎంపిక..


మేడి రాంమనోహర్

చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన రైల్వే ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న మేడి ఎల్లయ్య కొనేళ్లుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఇతని కుమారుడు రామ్‌మనోహర్ సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యారు. ఆతను 2018లో బీటెక్(ఈసీఈ)ను పూర్తి చేశాడు. ఇష్టంతో కష్టపడి చదవటంతో ఎస్‌ఐ ఉద్యోగాన్ని సాధించినట్లు రామ్‌మనోహర్ తెలిపారు.

నిరుపేద రైతు కుటుంబంలో జన్మించి..


వంగూరి మహేందర్

మునుగోడు: మునుగోడు మండలంలోని చొల్లేడు గ్రామ పంచాయతీ పరిధిలోని వంగూరిగూడెం గ్రామానికి చెందిన వంగూరి రాములు, లింగమ్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు మహేందర్ సంతానం. ఎంబీఏ పూర్తిచేసిన మహేందర్ 2018 లో ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ఆ ఉద్యోగం చేస్తూనే సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు.

ఫైర్‌మన్ సివిల్ ఎస్‌ఐగా..


కొంపల్లి సతీష్

నిడమనూరు: నిడమనూర్‌కు చెందిన కొంపల్లి సతీష్ మిర్యాలగూడ ఫైర్ స్టేషన్‌లో ఫైర్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఉద్యోగం చేస్తూనే సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. ఎస్ఎఫ్ఓ యాదగిరి ఆధ్వర్యంలో ఫైర్‌స్టేషన్‌లో సతీష్‌ను సత్కరించారు. తమ రెండో కుమారుడికి ఎస్‌ఐ ఉద్యోగం రావడం పట్ల తల్లిదండ్రులు అయోధ్య, సుగుణమ్మ సంతోషం వ్యక్తం చేశారు.

పట్టుదలతో ఎస్‌ఐగా..


బొంత ప్రవీణ్

గుండాల : గుండాల మండలం నూనెగూడెం గ్రామానికి చెందిన బొంత పాపయ్య, అండాలు చిన్న కుమారుడు బొంత ప్రవీణ్ డిగ్రీ పూర్తి చేశాడు. వీరిది పేద కుటుంబం. దిల్‌సుఖ్‌నగర్‌లోని ప్రైవేట్ ఇనిస్టిట్యూట్‌లో సన్నద్ధమై ఎస్‌ఐ ఉద్యోగాన్ని సాధించాడు. పట్టుదలతో ఎస్‌ఐగా ఎంపికైన ప్రవీణ్‌ను పలువురు గ్రామస్తులు అభినందించారు.

హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌ఐగా..


అలకుంట్ల నరేష్

గుండాల మండలం మాసాన్‌పల్లి గ్రామానికి ఆలకుంట్ల నర్సయ్య, నర్సమ్మల కుమారుడు ఆలకుంట్ల నరేష్ బీటెక్ పూర్తి చేశాడు. హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నరేష్ ఉన్నత ఉద్యోగానికి సన్నద్ధమయ్యాడు. ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగ ఫలితాల్లో ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. గ్రామాల ప్రజలు అతడికి అభినందనలు తెలిపారు.

ఎస్‌ఐగా ఎంపికైన రైతు బిడ్డ


తండ్రితో వీరబోయిన సైదులు

చివ్వెంల : చివ్వెంల మండల పరిధి లోని గుంజలూరు గ్రామానికి చెందిన వీరబోయిన వెంకన్న–మలింగమల్లమ్మల చిన్న కుమారుడు సైదులు 2020 లో ఫైర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి ఆలేరులో విధులు నిర్వహిస్తున్నాడు. అప్పటినుంచే ఎస్‌ఐ కావాలనే లక్ష్యంతో పట్టుదలతో కృషి చేసి కల నెవేర్చుకున్నాడు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..


చాడ సమత

మాడుగులపల్లి: మాడుగులపల్లి పంచాయతీ పరిధి గడ్డలబొరిగూడేనికి చాడ లింగారెడ్డి– స్వరూప దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె సమత పీజీ చదువుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమైంది. ఎస్‌ఐ పరీక్షలు రాసి తొలి ప్రయత్నంలోనే సివిల్ ఎస్‌ఐగా కొలువు సాధించింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే విజయం సాధించగలిగానని ఆమె పేర్కొంది.

ఇష్టంతో చదివి..


మహేష్

కనగల్ : కనగల్ మండలం కుమ్మరిగూడేనికి చెందిన నీలకంఠం యాదయ్య, మంగమ్మల కుమారుడు మహేష్ పీజీ పూర్తి చేశాడు. ఇటీవల రైల్వేలో గ్రూప్–డి ఉద్యోగం సాధించాడు. నల్లగొండలో కిరాయి రూం తీసుకుని స్వశక్తితో కష్టపడి చదివి ఏఆర్ ఎస్‌గా ఎంపికయ్యాడు. ఇష్టంతో చదివి ఉద్యోగం సాధించినట్లు మహేష్ పేర్కొంటున్నాడు.

ఏఆర్ ఎస్‌ఐగా..


సుశాంత్

తుంగతుర్తి : తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన పుల్లూరి వెంకన్న శారద దంపతుల కుమారుడు సుశాంత్ తొలి ప్రయత్నంలోనే ఏఆర్ ఎస్‌ఐగా ఉద్యోగం సాధించాడు. డిగ్రీ పూర్తి చేసిన సుశాంత్ తండ్రి మాదిరిగా పోలీస్ శాఖలోనే ఉద్యోగం చేయాలని తపనతో హైదరాబాదులో కోచింగ్‌కు వెళ్లి కొలువు సాధించాడు.

బాల్నేపల్లిలో దివ్యాంగుడి హత్య

- మరికొందరి సహకారంతో ఘాతుకానికి ఒడిగట్టిన దాయాది
- ఆస్తి తగాదాలే కారణం


కోటేశ్వర్‌రావు(ఫైల్)

అడవిదేవులపల్లి : నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల పరిధిలోని బాల్నేపల్లిలో ఓ దివ్యాంగుడు సోమవారం దారుణ హత్యకు గురయ్యాడు. భూ వివాదాల నేపథ్యంలో మరో ఇద్దరి సహకారంతో దాయాది గొడ్డలితో నరికి ఘాతుకానికి ఒడిగట్టాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాల్నేపల్లి గ్రామానికి చెందిన జడ కాటమయ్య, జడ అంజయ్య అన్నదమ్ముళ్లు, కాటమయ్య కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. సొంత కొడుకు కాశయ్య తండ్రిని పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో కొంత కాలంగా కాశయ్య తమ్ముడి కొడుకు కోటేశ్వర్‌రావు(35) పెదనాన్న బాగోగులు చూస్తున్నాడు. దీంతో కాశయ్య తనకున్న పొలంలో 30గుంటల భూమిని కోటేశ్వర్‌రావుకు రిజిస్ట్రేషన్ చేయించాడు. దీనిని జీర్ణించుకోలేని కాశయ్య రిజిస్ట్రేషన్ విషయంపై తరచూ కోటేశ్వర్‌రావుతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలోనే కోటేశ్వర్‌రావుపై కక్ష పెంచుకున్న కాశయ్య అతడిని హత్య చేసేందుకు గ్రామానికి చెందిన దగ్గరి బంధువులైన జడ శ్రీను, జడ నర్సింహులు సహకారం కోరాడు. సోమవారం తన పెద్దనాన్నకు స్నానం చేయించేందుకు వెళ్లిన కోటేశ్వర్‌రావును మరో ఇద్దరితో కలిసి కాశయ్య గొడ్డలితో నరికి చంపాడు.

ఉలిక్కిపడ్డ గ్రామం

ఫ్యాక్షన్‌కు పేరుగాంచిన బాల్నేపల్లిలో 14 ఏళ్ల తరువాత హత్య జరగడంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గ్రామస్తులు భయందోళనకు గురయ్యారు. హతుడికి భార్య మల్లేశ్వరి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకుని డీఎస్పీ వెంకటగిరి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. డీఎస్పీ వెంట మిర్యాలగూడ రూరల్ సీఐ ముత్తినేని సత్యనారాయణ, మాడుగులపల్లి ఎస్‌ఐ నరేష్ తదితరులున్నారు.

చేనేత కళాకారులకు పురస్కారాలు



అవార్డులు అందుకుంటున్న చండూరు, గట్టుప్పల్ చేనేత కార్మికులు

భూదాన్‌పోచంపల్లి, చండూరు : చేనేతరంగంలో విశేష ప్రతిభ కనబర్చిన పోచంపల్లికి చెందిన ముగ్గురు చేనేత కళాకారులు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర పురస్కారాలు అందుకున్నారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని మన్నెగూడెంలో బీఎస్ఆర్ పార్థ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో చేనేతలో నూతన డిజైన్లను రూపొందించిన సాయిని భాస్కర్, దోర్నాల శేషగిరి, 10వేల రంగుల షేడ్స్‌తో మధ్యన భారతదేశం పటం కల్గిన స్కార్ఫ్ తయారు చేసిన భోగ సరస్వతితో పాటు చండూరు, గట్టుప్పల్ మండలాలకు చెందిన కోట జానకీ రాములు, చిలుకూరి వీరేశం, చిలుకూరి కృష్ణ, మండల కిరణ్, కర్నాటి ప్రవీణ్‌కు రాష్ట్ర చేనేత జౌళిశాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వీరికి ప్రసంశాపత్రం, షీల్డ్‌తో పాటు రూ.25వేలు నగదు పురస్కారాలను అందజేశారు.

సంసార జీవితానికి అడ్డొస్తున్నాడని..

- బాలుడి గొంతు నులిమి చంపిన సవతి తల్లి
- సాధారణ మరణంగా చిత్రీకరించేందుకు యత్నం
- నాయనమ్మ ఫిర్యాదుతో హత్య ఘటన వెలుగులోకి
- నిందితురాలు అరెస్ట్


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగభూషణం

సూర్యాపేట రూరల్ : సంసార జీవితానికి అడ్డు వస్తున్నాడన్న నెపంతో ఓ మహిళ బాలుడిని గొంతు నులిచి హత్య చేసి ఆపై సాధారణ మరణంగా చిత్రీకరించేందుకు ప్లాన్ చేసింది. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలంలోని మూడో విడత ఇందిరమ్మ కాలనీకి చెందిన మచ్చ మధు 2015లో కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి రెండేళ్ల తర్వాత బాబు టైసన్ (06)జన్మించాడు. టైసన్‌కు రెండేళ్ల వయసున్న సమయంలోనే తండ్రి వదిలేసి వెళ్లిన తల్లి మరొకరిని వివాహం చేసుకుంది. దీంతో మధు తల్లి కళమ్మ దగ్గరే టైసన్ పెరుగున్నాడు. ఆరు నెలల క్రితం మోతె మండలం సర్వారానికి చెందిన బొడ్డు వాణి అలియాస్ రాణితో మధు ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. అప్పటి నుంచి ఇద్దరు సహజీవనం చేస్తున్నారు. టైసన్‌ను సూర్యాపేట పట్టణంలోని సూర్యాపేట పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో విద్యనభ్యసిస్తున్నాడు.

అమ్మా.. కడుపులో నొప్పిగా ఉందన్న..

టైసన్ రోజు మాదిరిగానే స్కూల్‌కు వెళ్లాడు. స్కూల్ నుంచి రాగానే సవతి తల్లికి అమ్మా బాగా కడుపులో నొప్పిగా ఉందని చెప్పాడు. వెంటనే గదిలోకి వెళ్లి మంచంపై నొప్పి భరించలేక నిద్రిస్తుండగా.. సవతి తల్లి టైసన్ గొంతు గట్టిగా నులిమి హతమార్చింది.వెంటనే టైసన్ తండ్రి మధుకు ఫోన్ ద్వారా టైసన్‌కు బాగా కడుపులో నొప్పిగా ఉందని.. రోదిస్తున్నాడంటూ తెలిపింది. ఇంటికి చేరుకున్న టైసన్ తండ్రి మధు పట్టణంలోని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లుగా నిర్ధారించారు.

నాయనమ్మ ఫిర్యాదుతో..

టైసన్ నాయనమ్మ కళమ్మ తన మనువడి మృతిపై తనకు అనుమానం ఉందని ఈనెల 4న రాత్రి రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. టైసన్ మృతదేహానికి జనరల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించగా.. నివేదికలో గొంతు నులిమి చంపినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. వెంటనే సవతి తల్లిపై అనుమానం వ్యక్తం కావడంతో ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించింది. దీంతో ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలోసీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐ సాయిరాం, సిబ్బంది అజ్గర్, ఇరుగు బాబు, సుభద్ర, శ్రీనివాస్, లింగారెడ్డి, వెంకటేశ్వర్లు, జనార్ధన్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.